రూ.2.50కోట్ల సీహెచ్‌సీ ఓపీ బిల్డింగ్ ప్రారంభం

విశాలాంధ్ర -భీమడోలు : వైద్యరంగాన్ని బలోపేతం చేయడానికి సీఎం జగన్ నేతృత్వంలో వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం భీమడోలు సామాజిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో రూ.2.50 కోట్లతో నూతనంగా నిర్మించిన ఓపి బ్లాక్ భవనాన్ని, పలు విభాగాలను ఎమ్మెల్యే వాసుబాబు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వం సమకూర్చిన అత్యాధునిక పరికరాల పనితీరును వైద్యాధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న ఉన్నత లక్ష్యంతో సీఎం జగన్ వైద్య విధానంలో వినూత్న మార్పులను తీసుకువచ్చారని, గ్రామాల్లో సైతం పీహెచ్సీ, సిహెచ్సి లలో వైద్యులు, వైద్య సిబ్బంది నియామకం వైద్య పరికరాల ఏర్పాటుతో నూతన ఒరవడికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. కార్యక్రమంలో డీసిహెచ్ఎస్ బి.సతీష్ పాల్, సిహెచ్సీ సూపరిండెంట్ సునీత, ఆసుపత్రి ఛైర్మన్ చింతా శ్రీరామచంద్రమూర్తి, సర్పంచ్ సునీత, ఎంపీపీ రామయ్య, జడ్పీటీసి భవానీ, సొసైటీ ఛైర్మన్ సత్యశ్రీనివాస్, ఏఎంసీ ఛైర్మన్ నీలిమా, ప్రజాప్రతినిధులు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఒక ఛాన్స్ అయిపోయింది

విశాలాంధ్ర- ఉంగుటూరు : సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఒక ఛాన్స్ అయిపోయిందని ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. గురువారం భీమడోలు టిడిపి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలయ్యిందన్నారు. ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆపార్టికి గుడ్ బై చెపుతున్నారని అన్నారు. 2024 ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ జగన్ రెడ్డిలో అధికారం కోల్పోతాము అనే భయం పట్టుకుందని, అందుకే స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలను ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మార్చుతున్నారని అన్నారు. కేవలం జగన్ తన అధికారాన్ని, స్థాయిని నిలబెట్టుకోవ దానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నప్పటికీ పార్టీ భవిష్యత్తుపై సొంత పార్టీ వర్గీయులు సందిగ్ధంలో ఉన్నారని అన్నారు.

గ్రంధి వెంకటేశ్వరరావు (జివిఆర్) ద్వితీయ వర్ధంతి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : మున్సిపల్ మాజీ ఛైర్మన్, దివంగత ప్రజా నాయకుడు గ్రంధి వెంకటేశ్వరరావు (జివిఆర్) ద్వితీయ వర్ధంతిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైసిపి నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జివిఆర్ విగ్రహానికి ఆయన తనయుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు తిరుమాని ఏడుకొండలు,తోట భోగయ్య, కోడే యుగంధర్, గూడూరి ఉమాబాల తదితరులు మాట్లాడుతూ జివిఆర్ భీమవరం మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ముక్కుసూటిగా మాట్లాడుతూ ప్రజల చేత ప్రజా నాయకుడిగా పేరు తెచ్చుకున్న జివిఆర్ రాజకీయంగా ఎంతో మందికి ఆదర్శంగా నిలవడంతో పాటుగా, అనేక మందికి రాజకీయ భిక్ష పెట్టారని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరి చర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, నందమూరి ఆంజనేయులు, నల్లం రాంబాబు, ముద్దల కరుణ్ కుమార్ పాలవెల్లి మంగ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.10 వేలు అందజేసిన సత్తిపండు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెల కట్టలేనివని టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు అన్నారు.గురువారం పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు తన తండ్రి, మాజీ సర్పంచ్ పరిమి గంగరాజు జ్ఞాపకార్థం సీఐటీయూ యూనియన్‌కు చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రూ.5 వేలు, ఏఐటీయూసీ యునియన్‌కు చెందిన పారిశుధ్య కార్మికులకు రూ.5 వేల రూపాయలు ఆయా కార్మిక సంఘాల నాయకులకు అందచేశారు. సమ్మె సందర్భంగా కార్మికులకు అవసరమైన ఖర్చులకు ఈ డబ్బును వినియోగించుకోవాలని సత్తిపండు సూచించారు.

ఘనంగా ముగిసిన భాగవత సప్తాహ యజ్ఞము

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కేశవరం గ్రామంలో శ్రీ రాజ్యలక్ష్మి సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో గత ఏడు రోజులుగా నిర్వహించిన భాగవత సప్తాహ యజ్ఞము గురువారం ముగిసింది. శ్రీపాద శ్రీరామచంద్రమూర్తి వారి నేతృత్వం లో డిసెంబర్ 28వ తేదీన మొదలైన ఈ సప్తాహ యజ్ఞంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. యజ్ఞం అనంతరం శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొంపెల్ల శివ సుబ్రహ్మణ్య శర్మ భాగవతం ప్రవచనం చేసి, అనంతరం కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. భాగవతా సుదానిది అనే బిరుదును ప్రదానం చేసి సువర్ణ సహిత కంకణాన్ని శివ సుబ్రహ్మణ్య శర్మ కి అలంకరించారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు 2500 మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

భీమడోలులో పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర- భీమడోలు: భారత దేశంలో మూడువేల రూపాయల పింఛన్ ఇచ్చిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం భీమడోలు హైస్కూల్ ఆవరణలో మండలానికి చెందిన 9036మంది లబ్దిదారులకు పెరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వాసుబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈమేరకు పెరిగిన పింఛన్ ను లబ్దిదారులకు ఎమ్మెల్యే వాసుబాబు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ సీఎం జగన్ఇచ్చిన ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ ను పెంచి ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనుమాల రామయ్య, జడ్పీటీసీ తుమ్మగుంట భవాని రంగా, సర్పంచ్ సునీతా మాన్ సింగ్, గుడివాడ నాగగౌతమి, వెజ్జు బాలాజీ నాయుడు, దాయం సుజాత, వేపూరి నాగదీపిక, ఏఎంసి ఛైర్మన్ ఇంజెటి నీలిమాజూనియర్, తహసీల్దార్ ఇందిరాగాంధీ, ఎంపీడీవో పద్మావతిదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని కె.గోకవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని ప్రగడవరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ 2047కు దేశాన్ని అభివృద్ధి చేయటానికి ప్రతీ ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండటానికి ఆరోగ్య పథకాలు ఉపయోగపడతాయని వైద్యాధికారి కిషోర్ వివరించారు. కార్యక్రమంలో పిఎంజెఎవై బీమా పథకంలో 40 మంది లబ్దిదారులకు రూ.5 లక్షల విలువ చేసే బీమా పథకం కార్డులను అందించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు చవటపల్లి విక్రమ్‌కిషోర్, రాయంకుల చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అంశాలపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-ఏలూరు: ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిశీలించడానికి అలాగే నమోదు చేయించుకోవడానికి ఎన్నికల కమిషన్ ఈనెల 12వ తేదీ వరకు గడువు పొడిగించడం దృష్ట్యా పూర్తిస్థాయిలో ఓటరు జాబితాకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ నియోజకవర్గ ఇఆర్‌ఓలు, ఏఇఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. గురువారం కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశ మందిరంలో ఎలక్ట్రోరోల్ కు సంబంధించి అంశములైన పిడబ్ల్యూ ఓటర్లు ఎక్కువగా తగ్గడానికి కారణాలపై, అలాగే 18-19 సంవత్సరాల ఓటర్లుగా నమోదు కాకపోవడానికి గల కారణాలు ప్రోస్పెరిటీ ఓటర్సు గురించి, ఫారం-6 ద్వారా 18 సంవత్సరాలు దాటిన వారు ఓటరు నమోదు, ఆన్ లైన్ అప్లికేషన్ల గురించి మరియు ఆన్ లైన్ ఆఫ్ లైన్ అప్లికేషన్, మరణాలు, వలసలు రీజన్ గురించి జండరు రేషియో గురించి, ఫారం డిస్పోజిబుల్ పంపిణీ స్టేటస్ మరియు ఇప్పటి వరకు స్వీకరణ, పోలింగ్ స్టేషన్సు, లొకేషన్స్, కలెక్షన్స్ తదితర అంశాలపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నియోజకవర్గాల వారీగా సమీక్ష చేశారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జెడ్పి సిఇఓ కె. ఎస్.ఎస్. సుబ్బారావు, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డిఓలు ఎస్ఎస్ కె ఖాజావలి, ఎ. అద్దయ్య, డిప్యూటీ కలెక్టర్స్ కె. గీతాంజలి, జివివి సత్యనారాయణ, తహశీల్దార్లు బి. సోమశేఖర్, నాంచారయ్య, సుమతి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్రలో 3వేలు పెన్షన్ అందిస్తున్న ఘనత జగన్‌దే

విశాలాంధ్ర-టి నరసాపురం: దేశ చరిత్రలో అవ్వా తాతలకు 3వేలు పెన్షన్ అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వైసిపి పోలవరం నియోజకవర్గం ఇన్చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి తో కలిసి గురువారం పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7920 మంది పెన్షన్ దారులకు ప్రతి నెలా వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపిపి దారబోయిన లక్ష్మి వెంకటేశ్వరరావు , వాసిరెడ్డి మధు, ఎస్ విపికెహెచ్ శ్రీనురాజు, సర్పంచ్ మోదుగు సునంద, ఎంపిటిసి బొడ్డపాటి రాంబాబు, నార్లపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి టీడీపీ మద్దతు

విశాలాంధ్ర - లింగపాలెం : అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న నిరవధిక సమ్మెకు తెలుగుదేశం నాయకులు మద్దతు తెలిపారు. లింగపాలెంలో సిబ్బంది చేస్తున్న సమ్మె శిబిరానికి తెలుగుదేశం పార్టీ నాయకులు సొంగా రోషన్, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, పల్లె శ్రీను తదితరులు చేరుకుని సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బంది పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని జగన్ ప్రభుత్వాన్ని నమ్మె స్థితిలో ప్రజలు లేరని ఈ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బి.జె.ఎస్.కుమారి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు

విశాలాంధ్ర - పోడూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను 3 వేలకు పెంచి ఇస్తున్నామని ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. మండలంలోని 16 గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు పెంచిన పింఛన్లను మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీ రంగనాదరాజు పాలకొల్లు వైసీపీ ఇన్చార్జ్ గుడాల గోపీలు గురువారం పంపిణీ చేశారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోకుండా ముఖ్యమంత్రి జగన్ కు అందరూ మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. జడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు ఎంపీపీ సబ్బితి సుమంగళి వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

భారత్ అభియాన్ విభాగం ప్రారంభం

విశాలాంధ్ర-కాళ్ళ : గ్రామాల అభివృద్ధికి సాంకేతిక సహాయం అందించాలనే లక్ష్యంతో భారత ప్రధాని నరేందర్ మోడీ దేశవ్యాప్తంగా ఉన్నత భారత్ అభియాన్ విభాగాలు ఏర్పాటు చేశారని ఆంధ్ర యూనివర్సిటీ ఉన్నత భారత్ అభియాన్ కోఆర్డినేటర్ బి. పావని పేర్కొన్నారు. కాళ్ల మండలం పెద అమిరంలో గురువారం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో వ్యక్తిగత భద్రత పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పెద అమిరం యు బి ఏ కోఆర్డినేటర్ డాక్టర్ కే యం గణేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలు దత్తత గ్రామాల్లో సాంకేతిక సహాయం అభివృద్ధి కార్యక్రమాల్లో సూచనలు వంటి కార్యక్రమాలు చేపట్టడంలో భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఏయూలో మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు మాట్లాడుతూ గత ఏడాది దత్తత గ్రామాలైన కోపల్లె పెదమిరం జక్కరం కాళ్ళ కాళ్ళకూరు గ్రామాలలో తమ యూబీఏ విభాగం కళాశాల యాజమాన్యం సహకారంతో చాలా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పెద అమిరం గ్రామ సర్పంచ్ డి. సోమేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామాన్ని యూబీఏ దత్తత తీసుకొని సాంకేతిక సహకారం సూచనలు అందించటం తమ గ్రామ ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నత భారత అభియాన్ కోఆర్డినేటర్, ఆర్ అండ్ డిన్ డాక్టర్ పి ఏ రామకృష్ణమరాజు, ఉన్నత భారత అభియాన్ ఉత్తమ కోఆర్డినేటర్ అవార్డు గ్రహీత డాక్టర్ టి. రాంబాబు, డాక్టర్ పి. భువనేశ్వరి ,డాక్టర్ పి. రఘురాం, డాక్టర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తహసిల్దార్ మృతి - చాట్రాయిలో విషాదం

విశాలాంధ్ర - చాట్రాయి : తహసీల్దార్ విశ్వనాధరావు నిద్రలోనే తుది శ్వాస విడవడంతో చాట్రాయిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం ఉదయం చాట్రాయి తహసిల్దార్ విశ్వనాథరావు విస్సన్నపేటలో నిద్రలోనే గుండెపోటు రావడంతో తుది శ్వాస విడిచారు. ఆసుపత్రికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. విషయం తెలిసిన వెంటనే సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హుటా హుటిన విస్సన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చి భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఏపీ కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి మండల పరిషత్ ఉపాధ్యక్షులు పి సుబ్బారెడ్డి తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

కోడి పందాలు, జూదాలు ఆడితే కఠిన చర్యల

విశాలాంధ్ర-మండవల్లి: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, జూదాలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె. రాజ్ కుమార్, మండల అభివృద్ధి అధికారి టికే వెంకటరమణ హెచ్చరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి కె వెంకటరమణ, మండల తహశీల్దార్ కే.రాజ్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందెములు, జూదములు , అనధికార మద్యం విక్రయాలు నిషేధం అన్నారు.సంక్రాంతి పండుగ సందర్భంగా అనగా ఈ నెల 2.అర్ధరాత్రి నుండి 18 అర్ధరాత్రి వరకు సెక్షన్ 144 అమలులో ఉన్నందున, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ జంతు హింస నిరోధక చట్టం 1960, గేమింగ్ చట్టం 1974 ను అనుసరించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ క్షేత్రములు , స్థలములు అనుమతించిన యజమానులపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో శ్రీ మహిత జయకేతనం

విశాలాంధ్ర - సీతానగరం: సైన్స్ ఒలింపియాడ్ లో శ్రీ మహిత జయకేతనం ఎగురవేసింది. మండలంలో కాటవరం గ్రామంలోని శ్రీ మహిత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో తమ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు గల విద్యార్థులు 72 మంది బంగారు పతకాలు సాధించగా 30 మంది లెవెల్ 2కి ఎంపికవ్వగా 8 మందికి క్యాష్ ప్రైజ్ రాగా ఇంటర్ నేషనల్ బెస్ట్ 8వ ర్యాంకును 6గురు సాధించారని ఐఐటి అకాడమిక్ డైరెక్టర్ ఎ. రాం ప్రసాద్ తెలిపారని అన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, అందుకు కారణమైన ఉ పాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

సంకీర్ణ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : టిడిపి, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. జగ్గంపేట మండలం మల్లిపాక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యుడు పైల శివరామకృష్ణ, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో దుంగ ముసలయ్య, చుక్క సతీష్, పైల సుబ్రహ్మణ్యం, వాసిరెడ్డి అప్పారావు, తదితర కుటుంబాలకు చెందిన వారు బుధవారం రాత్రి నవీన్ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నవీన్ పార్టీ కండువాలు వేసి తెదేపాలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు బద్ది సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. గురువారం జగ్గంపేట పట్టణంలోని శ్రీరామ్ నగర్ రామాలయం వద్ద నుండి లక్ష్మి నారాయణ ట్రస్ట్, విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో రామ నామ సంకీర్తనలతో ఇంటి, ఇంటికి అక్షింతలు అందజేశారు. స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తూ జై శ్రీరామ్ అంటూ సీతారాముల ప్రాణ ప్రతిష్ట చేసిన అక్షింతలు ప్యాకెట్‌ను, స్వామి వారి పోటోను భక్తులకు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అర్చకులు సూర్యనారాయణ శర్మ, వీర వెంకట సత్యనారాయణ రెడ్డి, నూకబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు కృషి

విశాలాంధ్ర - సామర్లకోట : క్రైస్తవుల హక్కులను పరిరక్షించి వారికి రక్షణ కల్పించేందుకు ఏఐసీసీ నిరంతరం కృషి చేస్తుందని ఏఐసీసీ జిల్లా అధ్యక్షులు రిక్కీగూటం అన్నారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు రెవ డాక్టర్ రైమో జహుహలోనేన్ ఉపాధ్యక్షులు డాక్టర్ జోసప్ భెన్నిల సారథ్యంలో తూర్పుగోదావరి జిల్లా ప్రసిడెంట్ రిక్కీగూటం ఎన్నికవగా ఆయన ఆధ్వర్యంలో పెద్దాపురం రిజియన్ ఏఐసీసీ కార్యవర్గం పరిచయం, వారికి సర్టిఫికేట్‌ల అందజేత కార్యక్రమాన్ని గురువారం సామర్లకోట మండలం బ్రహ్మానందపురం గ్రామంలోని కేటీసీ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రిక్కీగూటం మాట్లాడుతూ క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు ఏఐసీసీ ముందుండి పోరాడుతుందని అన్నారు. ఈ సందర్భంగా రీజియన్ అధ్యక్షులుగా ప్రసిడెంట్ రేవ డాక్టర్ విజా, ఉపాధ్యక్షులుగా రేవ ఆర్ లాజరస్, కార్యదర్శిగా రేవ స్టీపెన్ చందు, సహాయ కార్యదర్శిగా రేవ ఎ చంటి, కోశాధికారిగా ఎస్ సామ్యేల్ సుదీప్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా రేవ. వల్లూరి విజయ్ కుమార్, రేవ టి మోజస్ అబిషేక్, రేవ గోల్డ్ స్టోన్, రేవ ఎమ్ రాజేష్ కుమార్‌లు భాద్యతలు చేపడుతున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఏఐసీసీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా నియోజకవర్గ పాస్టర్స్ జేఏసీ క్రిస్మస్

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రపంచానికి శాంతి సందేశం అందించిన క్రిస్తు జన్మదిన కార్యక్రమాన్ని గురువారం మండల పరిధిలో గల ఈతకోట గంట రోడ్‌లో ఉన్న ఒలీవల స్వస్థతశాలలో ఘనంగా జరిగింది. నియోజకవర్గ జేఏసీ అధ్యక్షులు రెవ పమ్మి అమృతరావు అధ్యక్షతన నిర్వహించగ ముఖ్యాధితులుగా రెవ సిహెచ్ మోజెస్ ముఖ్య ప్రసంగం చేసారు, వీరితో పాటు రేవ పిఎస్ యెన్ మూర్తి మాట్లాడుతూ నియోజకవర్గ పాస్టర్‌లు జేఏసి ఏర్పాటు ఆవశ్యకతతో పాటు, క్రిస్తు అనుసరించిన విధానాన్ని వివరించి, అందును అనుసరించి జేఏసి ముందుకు తీసుకువెళ్లాలని, దానితో పాటు క్రిస్తు సువార్త ప్రతి వ్యక్తికి అందజేయాలని, వారు చూసించారు. రేవ పి మధు బాబు, వై చిన బాబులు, యూ సుందర్ విజయ్, బ్రదర్ సుగంధరత్నంలు వీరు జేఏసీ ముఖ్యలు మాట్లాడుతూ జేఏసి ముఖ్య ఉద్దేశం కేవలం దైవ సేవకులకు కష్టం వచ్చినప్పుడు అండగా ఉండడం, ఆపదలో ఆదుకోవడం, దైవ సేవ విస్తృత పరచడం మాత్రమే అని వారు తెలపారు. ఈ కార్యక్రమం అధ్యక్షులు రెవ. అమృతరావు ఆధ్వర్యంలో మరింత ముందుకు కొనసాగుతుంది అని అశాభావం వ్యక్తం చేసారు. వైస్ ప్రెసిడెంట్ యూ ఎనోష్ పాల్ ఐక్యత కలిగి జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు నాలుగు మండలాలు పాస్టర్‌లు కుటుంబ సమేతంగా భారీగా పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులంతా కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావాలి

విశాలాంధ్ర - అమలాపురం : కాంగ్రెస్ పార్టీలో అగ్రనేత స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల జాతీయ కాంగ్రెస్ పార్టీలో ఈ రోజు చేరడాన్ని ఏపీ కాంగ్రెస్ తరఫున స్వాగతిస్తున్నామని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా అనాడు నిర్వహించిన శాసన సభ్యుల సమావేశంలో రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేవరకు కాంగ్రెస్ శ్రేణులు విశ్రమించకూడదని పిలుపునిచ్చిన అంశాన్ని ఎపిసిసి వేదికగా షర్మిల గుర్తు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్లో భారతీయ జనతా పార్టీ అంటే బాబు, జగన్, పవన్‌లుగా మారిన సంక్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలకి జాతీయ కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయమని ఈ సందర్భంగా ఎపిసిసి భావిస్తున్నదన్నారు. రాజశేఖర్ రెడ్డి అభిమానులంతా తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఈ సందర్భంగా ఎపిసిసి తరపున పిలుపునిచ్చారు. రానున్న ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా ప్రజలు మద్దతునివ్వాలని ఆయన కోరారు.

అర్థనగ్నంగా మోకాళ్లపై శానిటేషన్ వర్కర్ల నిరసన

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు నగర పంచాయతీ ఎదుట సానిటేషన్ వర్కర్లు 9వ రోజు గురువారం సమ్మెలో భాగంగా అర్ధనగ్నంగా మోకాళ్లపై నుంచుని ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కే చిన్నా, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ వి రమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏదైతే ఉన్నాయో అవి అమలు చేయాలని, సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఘనంగా న్యూటన్ జయంతి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదిత్య గ్రంథాలయం, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో న్యూటన్ 381వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి న్యూటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ న్యూటన్ ఒక ఆంగ్ల, గణిత, భౌతిక శాస్త్రవేత్త, ఖగోళవేత్త, వేదాంతి, రచయిత ఆయన సహజ తత్వవేత్తగా వర్ణించబడ్డారని అన్నారు. అత్యంత ప్రభావవంతమైన శాస్త్రవేత్తలలో ఆయన ఒకరు, శాస్త్రీయ విప్లవంలో కీలకమైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిపార్ట్మెంట్ అఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ వారు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేత లైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్స్ డాక్టర్ పి. రవికుమార్, కె. మనోజ్ కుమార్ రెడ్డి, డాక్టర్ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంతోషం నింపేందుకు కృషి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన వైయస్ఆర్ పెన్షన్ కానుక నూతన పెన్షన్లు, రూ.3000లు చేసిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని అవ్వా, తాతలకు పెన్షన్లు అందచేశారు. ఆత్రేయపురం మండలంలో 186 మంది కొత్తగా పెన్షన్ల లబ్ధిదారులు పెరిగారు. దీనితో, ఇప్పటి నుంచి ఆత్రేయపురం మండలంలో 10017 మంది పెన్షన్లు అందుకోనున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం

విశాలాంధ్ర - కైకలూరు : దేశ చరిత్రలోనే ఏ రాష్ట్ర ముఖ్యమంత్రులు చెయ్యలేని విధంగా ఇచ్చిన హామీలను 100% అమలు చేస్తూ ఈ రోజు 3000 రూపాయలు వరకు పెన్షన్ పెంచి దాదాపు 66 లక్షల మందికి ప్రతి నెల పెన్షన్లు అందిస్తున్నారని, గత ప్రభుత్వంలో పెన్షన్ల కోసం పడిగాపులు పడి ఎక్కడో ఉన్న కార్యాలయం చుట్టూ తిరిగిన ఆ విధానాలకు మన ప్రభుత్వానికి ఉన్నా ప్రధాన తేడా అని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. కైకలూరులోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పెన్షన్ పెంపు, నూతన వైయస్ఆర్ పెన్షన్ కానుకలను లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ పాల్గొని 154 మందికి కొత్త పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ జగన్ అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విశదీకరిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, జిల్లా సంయుక్త కార్యదర్శి మహ్మద్ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహా సభలకు హాజరయ్యే తెలుగు పండితులకు "ఆన్ డ్యూటీ" ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: ఆంధ్ర సారస్వత పరిషత్ అభ్యర్ధన మేరకు తెలుగు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు 5,6,7 జనవరి రాజ మహేంద్రవరంలో నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలకు హాజరయ్యేందుకు "ఆన్ డ్యూటీ' సౌకర్యం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి శ్రీ వైస్ జగన్ మోహన్ రెడ్డికి, విద్యా శాఖా మంత్రి బొత్సా సత్యనారాయణకు, విద్యా శాఖ కార్యదర్శులు ప్రవీణ్ ప్రకాష్, సంచాలకులు సురేష్ నాయర్‌కు డాక్టర్ గజల్ శ్రీనివాస్ , చైతన్య రాజు , రాష్ట్ర ఉపాధ్యా య పండిత పరిషత్ సభ్యులు రవిచంద్ర, నిమ్మ గడ్డ సంపత్ ధన్యవాదాలు తెలియజేసారు.

వైసిపిలోకి చేరికలు బోగస్

విశాలాంధ్ర -భీమవరం : భీమవరం ఎమ్మెల్యే చేతుల మీదుగా వైసిపి తీర్థం పుచ్చుకున్నవారు జనసైనికులు కారని ఆ చేరికలు బోగస్ అని దీనిపై చర్చకు సిద్ధమని జనసేన జిల్లా కార్యదర్శి చెనమల చంద్రశేఖర్ అన్నారు. భీమవరంలో తన కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల భీమవరం ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన నుంచి వైసిపిలోకి చేరారంటూ జరిగిన చేరికలు బోగస్ అని వారు జనసైనికులు కాదని వారంతా శ్రీకాకుళం, ఉండి ,అమలాపురం, విజయనగరం వారని, ఒకరు కాళ్ల మండలం కోపెల్లి గ్రామానికి చెందిన వాలంటీర్ అని వీరిలో కొందరికి ఓటు హక్కు లేదని వీటిపై బహిరంగ చర్చకు సిద్ధమని, స్థానిక ఎమ్మెల్యే దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. భీమవరం నుంచి పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని బలంగా నమ్ముతామని రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టేది జనసేన టిడిపినేనని చెనమల అన్నారు. కార్యక్రమంలో బండి రమేష్ కుమార్, మోకా శ్రీను, మాగపు ప్రసాద్, లక్కొజు నాని ,వైవిఎస్ అప్పారావు, కత్తుల నీలెంద్ర, అతికెల ఆంజనేయ ప్రసాద్, యాతం గణేష్, గిరి, నవీన్ పత్తి హరి రామాయణం శ్రీను, కాళి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎంపై డీఎన్నార్ విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర -భీమవరం: ఈవిఎం మిషన్ల ద్వారా ఓటు సులభతరంగా వినియోగించుకోవచ్చని వీటి పనితీరుపై అవగాహన అవసరమని తహశీల్దార్ వై.రవికుమార్ అన్నారు. రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో డిఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు ఈవిఎం మిషన్, ఓటు హక్కుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఈవిఎం మిషన్, ఓటు వినియోగంపై విద్యార్థులు అనేక సందేహాలు అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ఇంకా ఓటు నమోదుకు ఈనెల 5 వరకు సమయం ఉందని, ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు, సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామ రాజు, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ రామయ్య, ఎ.వీరయ్య, సంఘసేవకులు చెరుకువాడ రంగసాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లాకు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు

విశాలాంధ్ర - కాకినాడ : భారత ప్రభుత్వం 2023 సంవత్సరానికి ప్రకటించిన ప్రతిష్టాత్మకమైన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాడక్ట్ జాతీయ అవార్డులలో వ్యవసాయేతర విభాగం క్రింద ఉప్పాడ జాంధాని చీరలు ఉత్పత్తులకు గాను కాకినాడ జిల్లాకు గోల్డ్ అవార్డు లభించింది. ఈ నెల 3వ తేదీన, న్యూఢిల్లీ లోని భారత మండపంలో కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వశాఖ, పరిశ్రమలు, అంతర్జాతీయ వాణిజ్య ప్రోత్సాహక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మ నిర్భర్ భారత్ ఉత్సవ్-2024 వేడుకలలో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ సుబ్రమణ్యం జయశంకర్, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా కాకినాడ జిల్లాకు ఈ అవార్డును ప్రదానం చేసారు. కాకినాడ జిల్లా కలెక్టర్ తరపున జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి కూరెళ్ళ పెద్దిరాజు ఈ అవార్డును అందుకున్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాడక్ట్ అవార్డులకు జాతీయ స్థాయిలో మొత్తం 560 ధరఖాస్తులు నమోదు కాగా, 64 ధరఖాస్తులు మాత్రమే నామినేట్ అయ్యాయి. వీటిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 16 ప్రాడక్ట్ లకు జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నాయి. వ్యవసాయేతర విభాగంలో ఉప్పాడ జాంధాని చీరలు ఉత్పత్తులకు కాకినాడ జిల్లా 2023 సంవత్సరానికి వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రాడక్ట్ అవార్డును గెలుచుకోగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే చెందిన పొందూరు చీరల ఉత్పత్తులకు శ్రీకాకుళం జిల్లా, హ్యాండ్లూమ్ సిల్క్ చీరల ఉత్పత్తులకు కర్నూలు జిల్లా సంయుక్తంగా బ్రాంజ్ అవార్డును అందుకున్నాయి. మదనపల్లి సిల్క్ చీరలకు అన్నమయ్య జిల్లా, మంగళగిరి హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు గుంటూరు జిల్లాలు ప్రత్యేక ప్రసంశలను అందుకున్నాయి. కాకినాడ జిల్లాకు లభించిన ఈ ప్రతిష్టాత్మక అవార్డును జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి పెద్దిరాజు గురువారం జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లాను కలిసి ఆమెకు అందజేశారు. జిల్లాకు జాతీయ అవార్డు లభించడం పట్ల కలెక్టర్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఈ గుర్తింపు ద్వారా ఉప్పాడ జాంధాని చీరలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుళ ప్రాచుర్యం, మార్కెటింగ్ లభించనుందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా జాంధాని చీరల ఉత్పాదనను పెంచేందుకు, తద్వారా చేనేత కార్మికుల ఆర్థిక వికాసాన్ని పెంపొందించేందుకు అవసరమైన సదుపాయాల విస్తరణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులను కోరారు.

సాగర తీరప్రాంత అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : దేశంలో ఉన్న సాగర తీరప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ పనిచేస్తున్నారని, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తం రూపాల తెలిపారు. గురువారం ఆయన యు కొత్తపల్లి మండలం అమీనాబాద్ గ్రామం రామన్న పాలెం వద్ద నిర్మిస్తున్న హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సాగర పరిశ్రమల కార్యక్రమం ద్వారా దేశంలో ఉన్న అన్ని తీరప్రాంతాల్లో అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చేపట్టినట్టు చెప్పారు. గత రెండు రోజులుగా తాను కాకినాడలో హార్బర్, రామన్నపాలెం వద్ద నిర్మిస్తున్న హార్బర్ నిర్మాణ పనులను కూడా పరిశీలించినట్టు తెలిపారు. ఇక్కడ నిర్మిస్తున్న హార్బర్ త్వరిత గతిన పూర్తి అయ్యేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్తపల్లి మండలంలో తీరప్రాంత సముద్రపు కోత ఎక్కువగా ఉందని కాకినాడ ఎంపి వంగా గీత తమకు తెలిపారని, దీనికి సంబంధించిన ఫైల్ ఇప్పటికే ప్రధాని మోడీ వద్ద పరిశీలనలో ఉందని తెలిపారు. ప్రాంతాలు వేరైనా సముద్ర తీర ప్రాంతాల్లో పరిస్థితులు ఒకేలాగా ఉంటాయని, వాటికి రాబోయే రోజుల్లో ఎలా ఎదుర్కోవాలో పూర్తిస్థాయిలో సన్నద్ధం అవుతామని మంత్రి తెలిపారు. కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్, రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, సర్పంచ్‌లు నక్క మణికంఠ, ఉమ్మిడి మేరీ జాన్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, రాష్ట్ర వైకాపా నాయకులు రావు చిన్నారావు, మత్స్యశాఖ అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు జగనన్న కృషి

విశాలాంధ్ర - గోపాలపురం : పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం మండలం లోని మండల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆవరణలో వృద్ధులకు పెన్షన్ రూ.3,000పెంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మాటతప్పని మడమ తప్పని మహానేతగా ఏ రాష్ట్రంలో ఈ విధంగా పాదయాత్ర లో ఇచ్చిన హామీలను100/శాతం నెరవేర్చడంతో పాటు, అవినీతి రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 38 లక్షల పెన్షన్లు పంపిణీ చేస్తే జగన్మోహన్ రెడ్డి 67. లక్షల పెన్షన్లు పెంచారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఈళ్ళ భాస్కరరావు, నియోజకవర్గ పరిశీలకులు జి. వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ వంగా వెంకటరమణ, సర్పంచ్ పైడి శిరీష, కురుకూరి ధనలక్ష్మి, ఎండపల్లి శేఖర్ బాబు, చెరుకుమిల్లి సొసైటీ చైర్మన్ దుగ్గిరాల రమేష్ బాబు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

మూడోరోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర - సామర్లకోట : మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా రెండో రోజు మున్సిపల్ కార్మికులకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు బలుసు వాసు, దేవల్ల విజయలక్ష్మి, శివ రిలే నిరాహారదీక్ష శిబిరం వద్దకు చేరుకునే కార్మికులతో కలిసి కూర్చుని సంఘీభావం తెలియజేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ, సీనియర్ కమ్యూనిస్టుపార్టీ నాయకులు ఎలిసెట్టి రామదాసు, యూనియన్ నాయకులు బొచ్చ శీను, కసింకోట ఆనందరావు, కసింకోట కిషోర్, కౌలు వరమ్మ, సింగంపల్లి పద్మ, బంగారు కొండమ్మ, చెన్నా నాగ మనీ, బంగారు లావణ్య, సత్తిబాబు, ఆజారి లావరాజు, వెంకటేశు, ఎస్వి నాగేంద్ర, మిర్యాల రాజు తదితరులు దీక్షా శిబిరంలో కూర్చోగా పలువురు కార్మికులు సంఘీభావంగా ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభు త్వం తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మికులు న్యాయమైన కోరికలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

షర్మిల రాక కాంగ్రెస్‌కు మరింత బలం

విశాలాంధ్ర-కొవ్వూరు : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ లో చేరటం ద్వారా పార్టీ మరింత బలపడేందుకు దోహదం చేస్తుందని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణ్ కుమారి అన్నారు. కొవ్వూరులో ఆమె మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని తపనపడ్డారన్నారు. తండ్రి ఆశయానికి అనుగుణంగా షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరటం రాబోయే రోజుల్లో దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావడాన్ని సంకేతంగా కనిపిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, తదితరులు పాల్గొని షర్మిలను అభినందించారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరుకుంటున్నానని అరిగెల అరుణ కుమారి పేర్కొన్నారు.

డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

విశాలాంధ్ర - కాకినాడ : ఏపీమున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) స్వతంత్ర సంఘాలు జేఏసీ పిలుపు మేరకు కాకినాడలో గురువారం ఉదయం స్థానిక శారద దేవి గుడి వద్దనున్న నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సమ్మె ప్రారంభమైంది. ఈ సమ్మెకు ముఖ్య అతిథులుగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. శారదా దేవి గుడి వద్ద నుండి కమిషనర్ కార్యాలయం వద్దకు కార్మికులు ప్రదర్శన చేస్తూ, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం కనీస వేతనం 26 వేల రూపాయలు మంజూరు చేయాలని, సీయల్స్, క్యాజువల్ అమలు చేయని మున్సిపల్ కార్మికుల డిమాండ్స్ పరిష్కరించాలని తదితర నినాదాలు చేశారు. సమ్మెను కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కార్మికుల 21 డిమాండ్స్ పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘం స్వతంత్ర సంఘాల జేఏసీ కోరగా అందులో కేవలం డ్రైవర్స్ అండర్ గ్రౌండ్ వర్కర్స్ మలేరియా వర్కర్స్‌కు మెడికల్ అలవెన్స్ వర్తింపజేస్తామని, పర్మినెంట్ చేయమని జీతాలు, పెంచమని ప్రభుత్వం మొండి వైఖరి వ్యవహరించడంతో తప్పనిసరిగా సమ్మెలోకి వెళ్తున్నామని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందని, ఇకనైనా ఆపి వారిని తక్షణమే పర్మినెంట్ చేయాలని అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున సంపూర్ణ సహకారం మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సమ్మెకు మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ది రెడ్ల సత్యనారాయణ, యూనియన్ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, సర్కిల్ ప్రతినిధులు సింహాచలం, చక్రవర్తి, బంగారు అప్పలకొండ, నిమ్మకాయలు విక్కి, లక్ష్మణ్, సుబ్బలక్ష్మి, గ్రంధి ప్రసన్న, ములికి సత్యనారాయణ, కటారి సత్యనారాయణ, అప్పన్న, బంగారు రాజేష్, పర్మినెంట్ ఎంప్లాయిస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో : రాష్ట్ర వ్యాప్తంగా న్యాయమైన సమస్యల కోసం మున్సిపల్ కార్మికులు సమ్మె నిర్వహిస్తుంటే ఆ సమ్మెను పరిష్కరించాల్సింది పోయి వైసీపీ సర్కార్ మరింత రెచ్చగొడుతున్నదని మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ, ఏఐటీయూసీ రాష్ట్ర కన్వీనర్ కోరుమామిళ్ల సుబ్బారాయుడు విమర్శించారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వందలాదిమంది మున్సిపల్ కార్మికులు మానవహారం నిర్వహించారు. అంతకుముందు రెల్లి పేట నుండి ప్రారంభమైన ప్రదర్శన జాంపేట గణేష్ చౌక్ దేవి చౌక్ మీదుగా మున్సిపల్ కార్పొరేషన్ వరకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె పర్యవేక్షణకు వచ్చిన జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 45 వేల మంది మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తున్నారని మున్సిపల్ కార్మికుల సమ్మెను ఓర్వలేని ప్రభుత్వం రాజమండ్రి పరిధిలో ఇద్దరు మున్సిపల్ కార్మికులకు అధికారులచే షోకాజ్ నోటీసులు ఇచ్చి భయపెట్టాలని చూస్తున్నారన్నారు. కార్మిక చట్టాల ప్రకారమే గత డిసెంబర్ 7న సమ్మె నోటీసును ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుంద్రపు రాంబాబు మాట్లాడుతూ 32 సంవత్సరాలు పనిచేసిన మున్సిపల్ కార్మికునికి గ్రాట్యూటీ ఇమ్మని జేఏసీ అడుగుతుంటే జగన్ తన సొంత ఆస్తి అడుగుతున్నట్లు కుదరదానడం దారుణం అన్నారు. సంపద సృష్టిలో కీలక పాత్ర పోషించే కార్మికుడికి రూ.26000 వేతనాలు ఇవ్వక ధరలు పెరగడంతో కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు రెడ్డి రమణ, ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల నందకిషోర్, బంగారు గిరి, కాకి శారద, ఎం శివ, గోడం గిరి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన సమ్మె

విశాలాంధ్ర - కాకినాడ/రామచంద్రపురం : మున్సిపల్ కార్మికులు జేఏసీ పిలుపులో భాగంగా రామచంద్రపురం రెండో రోజు మున్సిపల్

కాంట్రాక్ట్ పారిశుద్ధ కార్మికులు నిరవధిక సమ్మెను జయప్రదం చేశారు. గురువారం సమ్మె శిబిరాన్ని ప్రజానాట్యమండలి పట్టణ అధ్యక్షులు గొర్రెల రాము, జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) అధ్యక్షులు ఉండవిల్లి గోపాలరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్వాడి జిల్లా కార్యదర్శి ఎం. దుర్గ ప్రారంభించి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం 26,000 రూపాయలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, ప్రజానాట్యమండలి కార్యదర్శి ఎం. ప్రేమా నందం, జిల్లా ఏఐటీయూసీ కన్వీనర్, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు సత్తిరాజు, పిడిఎస్యు నాయకులు బి. సిద్దు, అరుణోదయ నాట్యమండలి నాయకులు వి. భీమశంకరం తదితరులు సంఘీభావం తెలియజేశారు. ఈ శిబిరంలో మున్సిపల్ కాంట్రాక్ట్ నాయకులు గోపి, వడ్డాది సతీష్ కుమార్, మందపల్లి అన్నవరం, కే రామకృష్ణ, సింగంపల్లి అనిల్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందిలేకుండా దృష్టి పెట్టండి

విశాలాంధ్ర - కాకినాడ : పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానికంగా బాధ్యతలు నిర్వహించేలా ప్రత్యేకాధికారులు దృష్టిపెట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, ప్రత్యేకాధికారులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమ్మెను దృష్టిలో పెట్టుకుని ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా చెత్తను రోడ్లపైనా, డ్రైనేజీలలో వేయవద్దని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో రెండేసి హూపర్‌టిప్పర్ వాహనాలు పనిచేస్తున్నాయని, అవి ఇంటి వద్దకు వచ్చినప్పుడు మాత్రమే అందజేయాలని, బయట వేయవద్దని కోరారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రజలకు సుఖశాంతులు

విశాలాంధ్ర - కరప : ఆధ్యాత్మిక చింతనతోనే ప్రజలు సుఖశాంతులతో జీవించగలుగుతారని కాకినాడ రూరల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కరప మండలం పెనుగుదురు గ్రామంలో రూ.35 లక్షల నిధులతో నిర్మించిన పాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొని జీర్ణోద్ధరణ చేశారు. గ్రామ సర్పంచ్ రెడ్డి పల్లి వెంకట మాధవి రమేష్ పాలమ్మ తల్లి అమ్మవారి వేడుకలను అంగరంగ వైభవంగా జరిపించగా గ్రామ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామాలయాన్ని జనసంద్రంతో ముంచెత్తారు. ఈ వేడుకలు చూసేందుకు వచ్చిన అతిరథ మహారధులు, భక్తులు భక్తి పరవశంతో ముక్తి పొందారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు దేవాలయ నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఇందులో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో దేవాలయ నిర్మాణాలకు కోట్లాది రూపాయలు వెచ్చించమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకీ శ్రీలక్ష్మీ సత్తిబాబు, జడ్పిటిసి వై సుబ్బారావు, చింతా ఈశ్వరరావు, రొక్కల గనిరాజు, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, బందారు మురళి, రెడ్డిపల్లి నారాయణరావు, తుమ్మలపల్లి గోవిందు, తుమ్మలపల్లి మాచరరావు, చిక్కాల రామచంద్రరావు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుండి మరింత బలోపేతం చేయాలి

విశాలాంధ్ర - పి గన్నవరం : కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుండి మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ

నియోజక వర్గ కన్వీనర్ వంటేద్దు బాబి పిలుపునిచ్చారు. పి గన్నవరం మండలం లోని లంకల గన్నవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చట్టాల జోగేశ్వరరావు నివాసం వద్ద నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి పూర్తిస్థాయిలో మండల కమిటీలు గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రజల వద్దకు వెళ్తామని తెలిపారు. అనంతరం మొట్టమొదటిసారి ఈ సమావేశం ద్వారా పి గన్నవరం నియోజకవర్గానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వంటేద్దు బాబి, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ ఆరీఫ్‌లను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రెటరీ మాచవరపు శివన్నారాయణ, నాయకులు వాకపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

విశాలాంధ్ర - రాజోలు : ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమ, పేద ప్రజలకు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ఉపయోగ కరమని రాజోలు, పి గన్నవరం ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు అన్నారు. గురువారం రాజోలు మండలం తాటిపాకలో సోమిశెట్టి ల్యాండ్ మార్క్ వద్ద సోమిశెట్టి ఆంజనేయులు, నాగలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో శ్రీసత్యసాయి సేవా సంస్థల ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడానికే వైఎస్ఆర్ పెన్షన్ కానుక

విశాలాంధ్ర - ఆలమూరు : పేదరికంలో ఉన్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులను ఆదుకోవడానికే దశల వారీగా పెన్షన్ సొమ్ము పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఆలమూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణము నందు పెంచిన పెన్షన్ నిధులను మండల స్థాయిలో పలువురు వైసీపీ నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు.మండల వ్యాప్తంగా 11,154 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా పెన్షన్ చెల్లిస్తుండగా, జనవరి నుంచి అదనంగా మరో 167 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్ చేకూరుతుందన్నారు. అనంతరం 25 లక్షల రూపాయల వైద్యంతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటీ లక్ష్మణరావు, జడ్పిటిసి తోరాటీ సీతామాహలక్ష్మి రాంబాబు, వైసీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి, డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వర రావు, పలువురు సర్పంచులు, పలు శాఖల అధికారులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోయినది

తూ.గో.జిల్లా, రాజమండ్రి మున్సిపల్ కాలనీ, డోర్ నెం: 23-04-10 నివాసి **చల్లగుళ్ళ విజయలక్ష్మి భర్త: వెంకట రామ బ్రహ్మ ప్రసాద్** అను నేను నా పేరున ది. **29-05-2008**వ తేదీన రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో, దస్తావేజు నెం. **2760/1986**రుగా రిజిష్టరు కాబడిన ఒరిజినల్ క్రియ దస్తావేజును నేను తూ.గో.జిల్లా, కొవ్వూరు పట్టణము నందు పోగొట్టుకున్నాను.

సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల నా తాలూకు పైన తెలిపిన చిరునామలకు గాని, లేక నా తాలూకు ఈ దిగువ ఫోన్ నెంబరుకు గాని తెలియజేయగలరు. తగిన పారితోషకం అందించబడును.

చల్లగుళ్ళ విజయలక్ష్మి
ఫోన్: 9440144530

ప్రకటన

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి అమలాపురం వారి కోర్టులో
M.V.O.P. No.11/2023
Between:
పాటి కోదండవాసు ...పిటీషనరు
మరియు
1. డొక్కాడి పల్లంరాజు
2.పితాని వీర వెంకట సత్యన్నారాయణ ... రెస్పాండెంట్స్

To,
2.పితాని వీర వెంకట సత్యన్నారాయణ
S/o. నరసయ్య, డోర్ నెం.1-87, శృంగవరప్పాడు, సత్తెమ్మ గుడి దగ్గర, సఖినేటిపల్లి, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా. 2వ రెస్పాండెంట్

పిటీషనరు **U/Rule 455 of A.P. M.V.Rules 1989 R/W Sec.166 of M.V. Act** 1988 ప్రకారం **Compensation** కోరుచు డిక్రీ **Pass** చేయమని 1,2 రెస్పాండెంట్లపై పిటీషను దాఖలు చేసినారు. ది.**18-01-2024** సం॥తేదీన 2వ రెస్పాండెంటు పైన తెల్పిన వారి కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలున్న ఎడల తెలియ పరుచుకొనవలెను. లేనిచో మీ పరోక్షముగా మీపై ఉత్తర్వులు జారీచేయబడును.

శ్రీమతి ముషిణి S.K.N. మణి
శ్రీ ముషిణి M.S. సురేష్
అమలాపురం పిటీషనరు తరుపు, న్యాయవాదులు
తేది:03-01-2024 అమలాపురం

విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

క్రీడా దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : నూతన టెక్నాలజీతో బంధాలకు దూర మవుతూ ఉన్నవారిని దూరం చేసుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో కీర్తిశేషులు మాజీ ఎంపీపీ కర్రి లచ్చారెడ్డి చిన్ననాటి మిత్ర బృందం ఆయన జ్ఞాపకార్థం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన 50 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసి స్నేహానికి ఉన్న విలువను చాటారు. ఏ కష్ట సమయంలో కలత చెందిన మనసుకి వెన్నెలా చల్లదనాన్ని, ప్రశాంతతను కలిగించే దివ్య ఔషధం స్నేహమే అని ఈ సందర్భంగా లచ్చారెడ్డి మిత్ర బృందం తెలిపింది. ఈ కార్యక్రమం కోస్తాంధ్ర రెడ్డి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు మల్లిడి శ్రీనివాసరెడ్డి (లెఫ్ట్), తేతల సూర్యా రెడ్డి, ప్రముఖ అడ్వకేట్ ద్వారంపూడి భాస్కర్ రెడ్డి, ద్వారంపూడి వీర్రాఘవరెడ్డి (స్వామి) తదితరులు ఉన్నారు.

అడుదాం ఆంధ్రలో క్రీడాకారులు ఎక్కడ?

విశాలాంధ్ర - సీతానగరం: అ మండలంలో వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న సంగతి అందరికి తెలిసిందే. గురువారం చినకొండేపూడి గ్రామ సచివాలయ పరిధిలో సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరగాల్సిన కో కో పోటీలకు ఒక్క క్రీడా కారుడు కూడా రాకపోవడంతో పాఠశాల మైదానంలో క్రీడా కారుల కోసం ఎదురుచూపులు చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో క్రీడాకారులు లేక మైదానాలు వెల వెల బోతున్నాయి.

నూతన పింఛన్లు అందజేత

విశాలాంధ్ర- పెరవలి : పింఛన్ల పెంపు విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్ర ప్రదేశ్‌లో 3 వేలుకు పింఛన్లను పెంచి అందజేస్తున్నామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పెరవలి మండలపరిషత్ కార్యాలయం వద్ద గురువారం కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకను166 మంది లబ్ధిదారులకు శ్రీనివాస్‌నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టం అన్నిరంగాలలో అభివృద్ధి చెందేవిదంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షులు జెడ్పీటీసీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుపై అవగాహన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు రాజమండ్రి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీ శ్రీనివాస రామానుజన్ మునిసిపల్ హై స్కూల్‌లో "నల్సా వారి పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవలు,వారి సంరక్షణ పథకం, 2015" పై న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి. కె.ప్రత్యూష కుమారి విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. విద్యార్థులు చదువు పై ఆసక్తి కలిగి ఉండాలని, నిరంతరం వివిధ విషయాలపై విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని అన్నారు. పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుని కొంత మంది వారి పై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, మోసపూరితంగా వారిని అక్రమ కార్య కలాపాలకు వాడుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనంను ఆమె పరిశీలించారు.

రత్నాకర్ కార్నియాలు ఐ బ్యాంక్‌కు అందజేత

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ మున్సిపల్ రెండవ వార్డుకి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ బొండాడ రత్నాకర్ రావు (77) అకస్మిక మృతి చెందారు, సామాజిక కార్యకర్త లయన్ ధూళిపూడి బాబి రత్నాకర్ కుటుంబ సభ్యులు భార్య సీతాదేవి, కుమారుడు కిషోర్‌తో సంప్రదించి రత్నాకర్ కార్నియాలును కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేశారు, ఐ బ్యాంక్ సిబ్బంది నానాజీ కార్నియాలును సేకరించారు. కుటుంబ సభ్యులు తీసుకున్న మంచి నిర్ణయం వలన కార్నియల్ అంధత్వం కలిగిన ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన ధన్యజీవి అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాధురి, సురేష్‌లను వలవల బాబ్జీ, రాంబాబు, సత్యమూర్తి, ధూళిపూడి సుబ్బారావు, తోటి రిటైర్డ్ బ్యాంక్ సిబ్బంది పరామర్శించారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం మునిపల్లి పంచాయితీ మునిపల్లి కోటి గట్టులో అమలాపురం ఎంపీ చింతా అనురాధ సమకూర్చిన రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం వైఎస్సార్ సిపి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు (అంబికా శ్రీను) ప్రారంభించారు. సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పిటిసి గెద్దం సంపదరావు, వైఎస్సార్ సిపి నాయకులు నల్లా శ్రీను, నిమ్మకాయల దుర్గబాబు సచివాలయ, సిబ్బంది వాలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కందికుప్పలో రెండు రక్త పింజర్ల పట్టివేత

విశాలాంధ్ర - కాట్రేనికొన: కందికుప్ప గ్రామ పంచాయతీ శివారు గరువు పేటలోని పంట బోదిలో రెండు రక్త పింజర్లను స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ పట్టుకున్నారు. గురువారం పంట బోదిలో ఉన్నట్లు స్థానికులు,రైతులు గుర్తించి స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వచ్చి పట్టు కోవడంతో సమీప రైతులుఊపిరి పీల్చుకున్నారు, ప్లాస్టిక్ సీసాలలో బంధించిన రక్త పింజిరలను దూర ప్రాంతాలలో వదిలి పెడతానని వర్మ తెలిపారు.

మద్దాలవారి పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, మద్దాలవారి పేట వార్డు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమం అమలాపురం మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్స్ నాగారపు వెంకటేశ్వరరావు, వాసంశెట్టి సత్యం, కో ఆప్షన్ మెంబర్ ఖ్వాజా బాబు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.